హ్యాపీ బర్త్‌డే మేడం..

ఘనంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ తినిపించుకుంటున్న నగర మాజీ మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలను జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. భారత జాగృతి నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కవిత అభిమానులు బర్త్‌డే వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ, రక్తదాన శిబిరం, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు. జాగృతి నాయకుడు అవంతిరావు ఆధ్వర్యంలో స్నేహ సొసైటీలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్ తదితరులు కేక్ కట్ చేసిన అనంతరం చిన్నారులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. న్యాయవాది దాదన్నగారి మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ పులి జైపాల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, టీయూలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బోధన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రజాక్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి కేక్ కట్ చేశారు.

స్నేహ సొసైటీలో పండ్లు పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, జాగృతి నాయకుడు అవంతిరావు తదితరులు

పుప్పాలపల్లిలో కేక్ కట్ చేస్తున్న 'ఉపాధి' కూలీలు

కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాంబారి మోహన్

బోధన్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్‌లో బాలుడికి బర్త్‌డే విషెస్ తెలుపుతున్న ఎమ్మెల్సీ కవిత

గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సంజయ్‌కుమార్

రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కంఠేశ్వర్, మార్చి 13: యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని గుర్తు చేశారు. ఐటీఐ ఏటీసీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెంటర్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తిస్తూ నివేదికలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రోడ్డు రవాణా వసతి తోపాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాల్లో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు, సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని తెలిపారు. జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏటీసీ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారంలోపు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వ్యవసాయాధారిత విత్తనశుద్ధి పరిశ్రమలకు అనుగుణంగా ఏటీసీ కేంద్రాల్లో కోర్సులు ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జూమ్ మీటింగ్‌లో సంబంధిత అధికారులు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

హోలీ పండుగ సంతోషంగా జరుపుకోవాలి : సీపీ

మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, మార్చి 13: హోలీ పండుగ సంతోషంగా జరుపుకోవాలని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య జిల్లా ప్రజలకు సూచించారు. బలవంతంగా ఇతరులపై రంగులు చల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ భవనంలో ఉన్న సమావేశ మందిరంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 13వ తేదీ సాయంత్రం ఆరు నుంచి 15వ తేదీ ఉదయం వరకు మద్యం అమ్మకాలు బంద్ చేయాలని సూచించారు. వైన్స్ దుకాణాలు, బార్లు, కల్లు బట్టీలు, డిపోలు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ యాప్‌ల విషయం తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు సీపీ వెల్లడించారు.

గంజాయి స్వాధీనం

వినాయక్‌నగర్, మార్చి 13: నగరంలోని ఐదో టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో బాబన్ సహాబ్ పహాడ్ వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. బైకుపై వెళ్తున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారిని తనిఖీ చేయగా.. 390గ్రాముల గంజాయి లభించింది. నిందితులు నగరంలోని దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన అనుశెట్టి రవి, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఇత్వర ఏరియా సిద్ధనాథ్ పురికి చెందిన సయ్యద్ జలానీ అని నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు సీఐ పేర్కొన్నారు.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, మార్చి 13: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో చాకుతో బెదిరించి దోపిడీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మార్తాండకు చెందిన మేకల లాలయ్య ఉపాధి కోసం నిజామాబాద్‌లో ఉంటున్నాడు. అతడిని నగరంలోని వీక్లీమార్కెట్‌లో ఓ వ్యక్తి బుధవారం అడ్డగించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడు నిరాకరించడంతో చాకుతో బెదిరించి, రూ.500 లాక్కొన్నారు. పక్కనే ఉన్న మరో మహిళను నెట్టివేసి ఆమె నుంచి వెయ్యి రూపాయలు లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడైన మోపాల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన ఆకుల నరసింహాను అరెస్టు చేసి, రూ.500 రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో

ముందుకుసాగాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 13: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌తోపాటు రసూల్‌బీ, పద్మశ్రీ, కృష్ణవేణి, నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు

ధర్పల్లి, మార్చి 13: హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని ఎస్సై రామకృష్ణ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉన్నదని, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు.

రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్

వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 13: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈఆర్‌వోలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్లతోపాటు ఈఆర్‌వోలు తమ స్థాయిలో రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహించి, వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్ట్రర్లలో నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తంచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

ఖలీల్‌వాడి, మార్చి 13: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోనని మదర్‌థెరిస్సా విగ్రహం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా ఉపాధ్యక్షులు దినేశ్, రాజు, నగర అధ్యక్షుడు ఆజాద్, యూనివర్సిటీ నాయకుడు పృథ్వీ, నగర నాయకులు పరమేశ్, చరణ్, రమేశ్, అజయ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, మార్చి 13: యూజీసీ నూతన ముసాయిదాను రద్దు చేయాలని, విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడుకుందామని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు పోస్టర్లను టీయూ ఆర్ట్స్ కాలేజీలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు కర్క గణేశ్ మాట్లాడుతూ.. 18న నిర్వహించనున్న సదస్సుకు యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నిందితుడితో పనులపై జిల్లా బాస్ సీరియస్?

శక్కర్‌నగర్, మార్చి 13: బోధన్ పోలీస్ స్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఓ నిందితుడితో పారిశుద్ధ్య పనులు చేయించిన ఘటనపై జిల్లా పోలీస్ అధికారి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. మోటర్ సైకిళ్ల చోరీ కేసు నిందితుడి కాళ్లకు బేడీలు వేసి పోలీస్‌స్టేషన్‌లో చీపురుతో ఊడ్పించిన సంఘటనపై 'కాళ్లకు బేడీలు –చేతిలో చీపురు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులపై శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. నిందితుడితో పనులు చేయించడంపై సీఐ వెంకటనారాయణ, హెడ్‌కానిస్టేబుల్‌కు షోకాజ్ నోటీసులు జారీ అవుతున్నట్లు సమాచారం.

హాకీ జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్‌టౌన్, మార్చి13: ఈనెల 16,17,18 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పురుషుల హాకీ టోర్నమెంట్ కోసం జిల్లా జట్టును గురువారం పట్టణంలోని హైస్కూల్ (బి) స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈనెల 15వ తేదీన బయల్దేరుతుందని హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

బాల్కొండ, మార్చి 13: ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పని చేస్తాయని, మధ్యాహ్న భోజనాన్ని 12.30 గంటలకు విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పని చేస్తాయని ఎంఈవో తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

మోర్తాడ్(భీమ్‌గల్), మార్చి13: తెలంగాణ రాష్ట్ర ఎంపీడీవోల సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్‌ను మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో జావెద్‌అలీ, సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్, జేఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

మోర్తాడ్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, ఈజీఎస్ సిబ్బంది

మోర్తాడ్, మార్చి13: గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. మోర్తాడ్ మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లో పనులను గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. పనులకు సంబంధించి వివరాలు, కొలతలు నమోదు చేయాలని సూచించారు. ఈజీఎస్ పనులను కార్యదర్శులు పర్యవేక్షించాలని, మస్టర్లను పరిశీలించి సంతకాలు చేయాలని, పనుల విషయంలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఏడాదిలో చేపట్టిన రూ.3కోట్ల 29లక్షల పనులకు సంబంధించిన వివరాలు చదివి వినిపించారు. కొలతల్లో తేడాలు గుర్తించిన పనులకు సంబంధించి రూ.7వేలు రికవరీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్, ఏపీవో శకుంతల, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను తెలుసుకోవాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రాజగౌడ్

ఆర్మూర్‌టౌన్, మార్చి13: వినియోగదారులు వారి హక్కులను తెలుసుకోవాలని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినియోగదారుల సంఘం కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈనెల 15న ప్రపంచ వినియోగదారుల దినం సందర్భంగా వీటిని ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కరపత్రాల్లో వినియోగదారుల హక్కులను పూర్తిగా వివరించినట్లు తెలిపారు.

అలరించిన కుస్తీపోటీలు

సాలూరలో కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

బోధన్‌రూరల్, మార్చి 13: సాలూర మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కుస్తీ పోటీలు అందరినీ అలరించాయి. గ్రామంలో బుధవారం రాత్రి కామదాహనం చేసి గురువారం హోలీ పండు జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా కుస్తీ పోటీలను నిర్వహించడం ఇక్కడి అనావాయితీ. ఈ పోటీల్లో చుట్టు పక్కల గ్రామలతోపాటు ఇతర గ్రామాల మల్లయోధులు తలపడ్డారు. గెలుపొందిన వారికి నగదును అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బోదకాలు నివారణకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శిఖర

నవీపేట, మార్చి 13: బోదకాలు(ఫైలేరియా) వ్యాధిని అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని, ఈ వ్యాధిని గుర్తించేందుకు ఈ నెల జనాభాలో 10 శాతం మంది నుంచి రక్త నామూనాలను సేకరిస్తున్నట్లు బినోలా వైద్యురాలు శిఖరా పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈనెల 24 నుంచి 27 వరకు రక్త నమూనాలను సేకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. నవీపేటలో ఈనెల 24 రాత్రి రక్త నమూనాలను సేకరించనున్నట్లు చెప్పారు. 25న ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల వద్ద ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి రక్త పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఎచ్‌వో వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ కిన్, గ్రామ కార్యదర్శి రవీందర్ నాయక్, వైద్య సిబ్బంది రాణి, పుష్ప, వినయ, ఆయా గ్రామాల ఆశ వర్కర్లు, ఏఎన్ ఎంలు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి

మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజశ్రీనివాస్

మోర్తాడ్, మార్చి13:జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఎండలు ముదురుతున్నందున పని చేసే ప్రదేశంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కూలీలు చేస్తున్న పనిని, కూలీల హాజరును పరిశీలించారు. మస్టర్లలో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు.

మట్కా నిర్వాహకుడికి జైలు శిక్ష

శక్కర్‌నగర్, మార్చి 13: బోధన్ పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప శాయి రెండు రోజులు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. బోధన్ బైపాస్ రోడ్డు పక్కన బహిరంగంగా మద్యం తాగిన వ్యక్తికి న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించారని బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ తెలిపారు.

మద్యం, కల్లు విక్రయాలు బంద్

శక్కనగర్, మార్చి 13: పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బోధన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈనెల 15వ తేదీ ఉదయం వరకు కల్లు, మద్యం విక్రయాలు బంద్ చేయాలని ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కల్లు, మద్యం విక్రయించే కేంద్రాలకు గురువారం సాయంత్రం సీల్ వేసినట్లు ఆయన తెలిపారు.

జోరుగా పన్నుల వసూలు

కమ్మర్‌పల్లిలో పన్ను చెల్లించిన వారికి రసీదు అందజేస్తున్న కార్యదర్శి గంగజమున

మోర్తాడ్, మార్చి 13: పన్నుల వసూళ్లు జోరుగా సాగుతున్నాయి. గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో రూ.59,696 పన్నులను వసూలు చేశారు. పన్నులు చెల్లించని వారి ఇండ్లకు వెళ్లి వసూలు చేస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు గంగాజమున, అజయ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల ఎదుట షెడ్లను తొలగించాలి

మోర్తాడ్, మార్చి13: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ దారులకు గ్రామపంచాయతీ నుంచి గురువారం నోటీసులు జారీచేశారు. దుకాణం మడిగె కాకుండా ముందు భాగంలో వేసుకున్న షెడ్డు కారణంగా వాహనాలు నిలిపేందుకు స్థలం లేదని పేర్కొన్నారు. దీంతో వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారని, తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వారం రోజుల్లో షెడ్లను తొలగించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

మనిషి పుర్రె, ఎముకలు లభ్యం

నవీపేట, మార్చి 13: మండలంలోని బినోలా శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో గురువారం ఓ మనిషి పుర్రె, దవడ ఎముకలను పోలీస్ స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపారు. ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. 2024 ఫిబ్రవరి 24న గాంధీనగర్ గ్రామానికి చెందిన మెడిగాం నర్సింహారెడ్డి మతి స్థిమితం కోల్పోయి అదృశ్యం కాగా ఇప్పటి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. నర్సింహారెడ్డికి సంబంధించిన పుర్రె ఎముకలు అయ్యి ఉంటాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. లభ్యమైన పుర్రె ఎముకలను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపేందుకు జిల్లా ప్రభుత్వ దవాఖానలో భద్ర పర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. డీఎన్ఏ రిపోర్టు వచ్చే వరకు ఎవరికి చెందిందో తెలియదని ఎస్సై చెప్పారు. జీపీ కారోబార్ చింతల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, DARAVASTHU MERA LALITHA (Old Name) W/o. DARAVASHTHU MOHAN R/o.H.No:1-9/1,Vill&Mdl:Kammarpally Dist:Nizamabad. T.G. Changed My Name as **DARAVASTHU LALITHA** (New Name) My Husband Passport No : M 5798556
NTZ- 338536

CHANGE OF NAME

★I, DARAVASTHU MERA MOHAN (Old Name)S/o DARAVASHTHU GANGARAM R/o.H.No:1-9/1,Vill&Mdl:Kammarpally Dist:Nizamabad. T.G. Changed My Sur-Name/Name as **DARAVASHTHU MOHAN** (New Name)My Passport No : M 5798556
NTZ- 338534

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్థిక సాయం అందజేత

మున్సిపల్ కార్మికుడి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, మార్చి13: పట్టణంలోని మామిడిపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లక్ష్మీనారాయణ మృతి చెందగా మున్సిపల్ కమిషనర్ రాజు మృతుడి ఇంటికి వెళ్లి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతిమ సంస్కారానికి పురపాలక సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

పరీక్షలు బాగా రాయాలి

బాల్కొండ, మార్చి 13: విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న పదో తరగతి ఫ్రీఫైనల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు సురేశ్ కుమార్, శంకర్ ఉన్నారు.